దీక్షా దివస్‌ను విజయవంతం చేయాలి



దుండిగల్: తెలంగాణ సాధించిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు దక్కుతుందని శాసనమండలి మాజీ చైర్మన్ స్వామి గౌడ్ అన్నారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు ఈ నెల 29న రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్న దీక్షా దివస్ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు మంగళవారం గండిమైసమ్మలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అధ్యక్షతన సన్నాహక సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి మల్కాజిగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి రాగిడి లక్ష్మారెడ్డి, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు కెపి. వివేకానంద్, మల్లారెడ్డి, మాధవరం కృష్ణారావు, బండారి లక్ష్మారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా స్వామిగౌడ్ మాట్లాడుతూ ఆంధ్ర పాలకుల హయాంలో అడుగడుగునా వివక్షకు గురైన తెలంగాణ ప్రాంత అభివృద్ధి స్వరాష్ట్ర సాధనతోనే సాధ్యమని నమ్మి 'తెలంగాణ వచ్చుడో... కేసీఆర్ సచ్చుడో' అనే నినాదంతో తెలంగాణలోని అన్ని వర్గాల ప్రజలను ఏకం చేసిన దార్శనికుడు బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ అన్నారు. మలిదశ ఉద్యమాన్ని ఉధృతం చేసేందుకు కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్ష ప్రారంభించిన 2009 నవంబర్ 29 తేదీని గుర్తు చేసుకుంటూ ఏటా దీక్షా దివస్ పేరుతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు మాట్లాడుతూ గత పదేళ్ల కాలంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందన్నారు. ప్రభుత్వ మార్పుతో అభివృద్ధి – సంక్షేమ పథకాలు అందక ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతూ ప్రజలను అవస్థల పాలు చేస్తున్న కాంగ్రెస్, బీజేపీలను ఎండగట్టేందుకు తెలంగాణ సమాజాన్ని మరోమారు ఏకం చేస్తూ రానున్న రోజుల్లో ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వంతో కొట్లాడే బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈనెల 29న ఉదయం ప్రారంభమయ్యే దీక్షా దివస్ కార్యక్రమానికి ప్రతి ఒక్కరు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మేయర్లు, కార్పొరేటర్లు, మున్సిపల్ చైర్మన్లు పాక్స్ డైరెక్టర్లు, ప్రజా ప్రతినిధులు, నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కాలుష్య కోరల్లో సుభాష్‌నగర్

● యథేచ్ఛగా రసాయనాల రీ సైక్లింగ్ ● పట్టించుకోని అధికారులు ● దుర్వాసనతో స్థానికుల అవస్థలు



కాలుష్యకారక పరిశ్రమలను అధికారులకు చూపిస్తున్న స్థానికులు



రీసైక్లింగ్ పరిశ్రమ నుంచి వెలువడుతున్న వ్యర్థాలు

జీడిమెట్ల: అధికారుల నిర్లక్ష్యం, అలసత్వం కారణంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని సుభాష్‌నగర్ కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు మంగళవారం కాలనీ వాసులు కాలుష్యానికి కారణమవుతున్న పరిశ్రమలను నేరుగా పీసీబీ అధికారులకు చూపించారు. కాలుష్యం కారణంగా ఎదురవుతున్న సమస్యలపై అధికారులకు పలు మార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వారు ఆరోపించారు. వివరాల్లోకి వెళితే.. సుభాష్‌నగర్ డివిజన్ వెంకటాద్రినగర్‌లోని రెసిడెన్షియల్ జోన్‌లో కొందరు వ్యక్తులు ఎలాంటి అనుమతులు లేకుండా రీసైక్లింగ్ పేరిట కాలుష్య కారక పరిశ్రమలు నిర్వహిస్తున్నారు. సదరు పరిశ్రమల నుంచి రసాయనాలు రోడ్లపై పారుతుండటంతో దుర్వాసనలు వెలువడుతున్నాయని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. సోమవారం రాత్రి రోడ్డుపై పారిన ఎర్ర రంగు రసాయనాలతో ఇబ్బందులు పడ్డామని వారు పేర్కొన్నారు. ఈ విషయమై హెచ్‌ఎండబ్ల్యూఎస్, పీసీబీ, మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. అధికారులు జోక్యం చేసుకుని కాలుష్యానికి కారణమవుతున్న పరిశ్రమలపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

నేరుగా డ్రైనేజీలోకి..

వివిధ ప్రాంతాల్లోని పరిశ్రమల నుంచి రసాయన డ్రమ్ములను తీసుకువచ్చి వాటిని ఇక్కడ శుభ్రపరచి నేరుగా రసాయనాలను నాలాల్లోకి వదులుతున్నారు. అసలు వీరికి భూగర్భ డ్రైనేజీకిలోకి నాలా కనెక్షన్ ఎలా వచ్చిందని స్థానిక ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అక్రమంగా భూగర్భ డ్రైనేజీలోకి కనెక్షన్ తీసుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పట్టించుకోని పీసీబీ

రసాయనాలు రోడ్లపై పారిన ప్రతిసారి స్థానికుల ఫిర్యాదుతో సంఘటనా స్థలాన్ని సందర్శించే పీసీబీ బాధ్యులపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నా. నెల రోజుల క్రితం ఓ రీసైక్లింగ్ యూనిట్ నుంచి రసాయనాలు రోడ్డుపై పారడంతో అక్కడకు వచ్చిన పీసీబీ అధికారులను సదరు యూనిట్ యజమాని విలేకరుల ఎదుటే దుర్భాషలాడినా వారు కిక్కురుమనకుండా అక్కడి నుంచి జారుకున్నారని వారు తెలిపారు.

పీసీబీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తాం

మేము గత కొన్నేళ్లుగా ఇక్కడే ఉంటున్నాం. రెసిడెన్షియల్ జోన్‌లో జాగా కొనుక్కుని ఇంటిని నిర్మించుకున్నాం కాలనీలో రీసైక్లింగ్ పరిశ్రమల్లోంచి విడుదలయ్యే రసాయనాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. పలు మార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం. ఇప్పటికైనా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించకపోతే మున్సిపల్ కార్యాలయం, పీసీబీ కార్యాలయం ఎదుట ధర్నా చేపడతాం..

– అనిల్ తివారీ
(వెంకటాద్రినగర్ కాలనీ వాసి..)

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు..

చింతల్: మరమ్మతుల కారణంగా 33/11 కేవీ సబ్ స్టేషన్ చిన్నతొకట్ట పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏడీఈ లక్ష్మీనారాయణ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఓల్డ్ బోయిన్‌పల్లి ఫీడర్ పరిధిలోని బాలాజీ ఎన్‌క్లేవ్, మల్లిఖార్జున కాలనీ, ఫ్రెండ్స్ కాలనీ, యాదవ బస్తీ, సాయికృష్ణ కాలనీ, రమ్య హాస్పిటల్ ఆపోజిట్ లైన్, బోయిన్‌పల్లి ఎక్స్ రోడ్డు, ఛత్రిగడ్డ, జీపీ సంఘం, మల్లిఖార్జున కాలనీ, మైనార్టీ స్కూల్, భాగ్యశ్రీ గార్డెన్స్, మధ్యాహ్నం రెండు గంటల నుండి 5 గంటల వరకు హస్మత్‌పేట్, ముస్లీం బస్తీ, లైన్‌స్టోన్ కాలనీ, అబ్‌రార్ నగర్, ట్రినిటీ టవర్స్, ఎస్‌ఎస్ రెసిడెన్స్, సూర్య ఎన్‌క్లేవ్, ఆపోజిట్ జీహెచ్‌ఎంసీ మోడల్ మార్కెట్,సత్య ఆర్కేడ్, ఎమరాల్డ్ లేక్ రెసిడెన్సీ తదితర ప్రాంతాల్లో చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు భగత్‌సింగ్ మేనల్లుడి రాక..

సుభాష్‌నగర్: గాజులరామారం విన్ ప్యాలెస్ ఫంక్షన్ హాల్‌లో బుధవారం సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించనున్న కార్యక్రమానికి షహీద్ భగత్‌సింగ్ మేనల్లుడు ప్రొఫెసర్ జగన్మోహన్‌సింగ్, కొత్తగూడెం ఎమ్మెల్యే సాంబశివరావు హాజరు కానున్నారు. ఈ సందర్భంగా ఆయన భగత్‌సింగ్ సిద్ధాంతాలు, ఆయన దేశానికి చేసిన సేవలపై ప్రసంగించనున్నారన్నారు. కార్యక్రమానికి సీపీఎం కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని పార్టీ నాయకులు కోరారు.

ప్రమాణ స్వీకారం



బొంగునూరి శ్రీనివాస్‌రెడ్డిని సత్కరిస్తున్న ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి

దుండిగల్: మేడ్చల్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా దుండిగల్ మున్సిపాలిటీ డి.పోచంపల్లికి చెందిన బొంగునూరి శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం ప్రమాణ స్వీకారం చేశారు. మేడ్చల్‌లో జరిగిన కార్యక్రమానికి శాసనమండలి చీఫ్ విప్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, తెలంగాణ గ్రంథాలయ పరిషత్ చైర్మన్ ఎండీ రియాజ్, రాష్ట్ర మహిళా సహకార అభివృద్ధి సంస్థ చైర్మన్ బంద్రు శోభారాణి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డి, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డిలతో పాటు నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలోని అన్ని మండలాల్లో గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేస్తానని, తనకు పదవి అప్పగించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

డివిజన్ అభివృద్ధికి కృషి

జగద్గిరిగుట్ట: డివిజన్ అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నానని జగద్గిరిగుట్ట డివిజన్ కార్పొరేటర్ జగన్ అన్నారు. మంగళవారం ఆయన డివిజన్ పరిధిలోని భూదేవి హిల్స్ డి బ్లాక్ లో దాదాపు రూ. 26 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు, రూ.7లక్షలతో చేపట్టిన యూజీడీ పనులను పనులను పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను కార్పొరేటర్‌గా ఎన్నికైనప్పటినుంచి అన్ని రంగాల్లో డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భూదేవి హిల్స్ డి2 బ్లాక్ శ్రీకాంత్ రెడ్డి, యాదగిరి, శ్రీనివాస్, కృష్ణ, తిరుమల్ రెడ్డి, రామస్వామి, జూపల్లి వెంకటేశ్వరరావు, సత్యనారాయణ, అంజయ్య, రామదాసు గౌడ్, నాయకులు విట్టల్ ముదిరాజ్, దాసు, త్రివేణి, మురళి, శ్యామల రావు, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

'అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు'

మియాపూర్: అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు తప్పవని ఎమ్మెల్యే గాంధీ హెచ్చరించారు. మియాపూర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శేరిలింగంపల్లి సర్కిల్, చందానగర్ సర్కిల్ పరిధిలోని పలు కాలనీ, బస్తీలలో నెలకొన్న సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పలు డివిజన్‌లలో సీసీ రోడ్డు పనుల్లో నాణ్యతా లోపంతో 6 నెలల్లోపే దెబ్బతిని గుంతలమయంగా మారుతున్నాయని, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రజాధనం దుర్వినియోగం అవుతుందని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నాసిరకం పనులు చేసిన కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే ఇలాంటి పరిస్థితులు నెలకొంటున్నాయన్నారు. ఇలాంటి పరిస్థితులు పునరావృతం అయితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, జీహెచ్‌ఎంసీ అధికారులు ఎస్‌ఈ శంకర్‌నాయక్, ఈఈ ప్రసాద్, డీఈ ఆనంద్, ఏఈ సంతోష్, నాయకులు రఘునాథ్‌రెడ్డి, ప్రసాద్, సందీప్‌రెడ్డి పాల్గొన్నారు.

28న 'ఎస్కీ'లో అంతర్జాతీయ సెమినార్

రాయదుర్గం: గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఎస్కీ) ఆధ్వర్యంలో ఈనెల 28వ తేదీన అంతర్జాతీయ సెమినార్ జరుగుతుందని 'ఎస్కీ' డైరెక్టర్ డాక్టర్ జి రామే శ్వరరావు తెలిపారు. ఎస్కీ క్యాంపస్‌లోని సెంటినరీ కన్వెన్షన్ సెంటర్‌లో ఉదయం 10.30 గంటలకు 'ఇన్నోవేషన్స్ ఇన్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ ఫర్ సస్టేనబుల్, డెవలప్‌మెంట్' (ఐఈటీఎస్‌డీ-2024) అనే అంశంపై సెమినార్ ఉంటుందన్నారు. ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇంజనీర్స్ ఇండి యా అధ్యక్షుడు డా.జి రంగనాథ్ అధ్యక్షతన జరి గే ఈ కార్యక్రమ ప్రారంభ సమావేశంలో ముఖ్య అతిథిగా సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొంటారన్నారు.

8న 'శాంతిసరోవర్'లో ప్రత్యేక సదస్సు

రాయదుర్గం: శాంతిసరోవర్‌లోని గ్లోబల్ పీస్ ఆడిటోరియంలో డిసెంబర్ 8న ప్రత్యేక సెమినార్‌ను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు వ్యాపార, వాణిజ్య రంగాలకు చెందిన వారికి 'పర్సనల్ ఎక్సలెన్స్ ఫర్ బిజినెస్ స్ట్రాటజీ అండ్ సక్సెస్' అనే అంశంపై ప్రత్యేక ఉపన్యాస కార్యక్రమం ఉంటుంది. అనంతరం మెడిటేషన్ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తారు. శాంతిసరోవర్ డైరెక్టర్ బికె కుల్‌దీప్ దీదీ ఆధ్వర్యంలో సాగే ఈ కార్యక్రమంలో శాంతా బయోటెక్ లిమిటెడ్ వ్యవస్థాపకుడు, చైర్మన్ పద్మభూషణ్ డాక్టర్ వరప్రసాద్‌రెడ్డి, ఐసీఏ ఇండియా ఫెలో మెంబర్ రామకృష్ణ చౌదరి, టర్కీ బ్రహ్మకుమారీస్ లీడర్‌షిప్ డెవలప్‌మెంట్ ట్రైనర్, డైరెక్టర్ యోగేష్ శార్దా, మౌంట్‌అబూ ఆర్ట్ కోఆర్డినేటర్ డేవిడ్ కిలోస్కీ వంటివారు పాల్గొంటారు. లైవ్ మ్యూజిక్ ఉంటుంది. కార్యక్రమంలో పాల్గొనే వారు తమ పేర్లను నమోదు చేసుకోవాలి. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 8087411206లో సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

సమస్యలను పరిష్కరించండి



ఎమ్మెల్యే వివేకానంద్‌కు వినతి పత్రం అందజేస్తున్న అంబేడ్కర్‌నగర్ వాసులు

నిజాంపేట్: ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని నిజాంపేట్ కార్పొరేషన్ బాచుపల్లి పరిధిలోని అంబేడ్కర్‌నగర్ వాసులు అన్నారు. ఈ మేరకు మంగళవారం ఎమ్మెల్యే వివేకానంద్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీ అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ సర్వే నెంబర్ 186లో గత 50 ఏళ్లుగా 100 కుటుంబాల ప్రజలు నివసిస్తున్నామని, తమ ప్రాంతానికి తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ లైన్‌లు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఇటీవల హౌసింగ్ బోర్డు అధికారులు తమ ఇళ్ల చుట్టూ ఫెన్సింగ్ వేస్తామని, ఇళ్లు ఖాళీ చేయిస్తామని బెదిరిస్తున్నారని, తమకు పట్టాలు ఇచ్చి న్యాయం చేయాలని కోరారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న మేయర్ కొలన్ నీలారెడ్డి

నిజాంపేట్: అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తిచేయాలని నిజాంపేట్ మేయర్ కొలన్ నీలారెడ్డి అన్నారు. మంగళవారం ఆమె నిజాంపేట్ కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్ సాబేర్ అలీతో కలిసి కాంట్రాక్టర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంట్రాక్టర్ల అసోసియేషన్ అధ్యక్షుడు హరినాథ్ తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులు, అందాల్సిన బకాయిలను మేయర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై సానుకూలంగా స్పందించిన మేయర్ నీలారెడ్డి అధికారులతో మాట్లాడి బకాయిలను విడుదల చేస్తామని, అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. సమావేశంలో కార్పొరేటర్ లక్ష్మీ కుమారి, ఎస్‌ఈ సత్యనారాయణ, ఆయా విభాగాల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ రాజ్యాంగ నిబంధనలు పాటించాలి

సాక్షి,సిటీబ్యూరో: భారతదేశ రాజ్యాంగం ఎంతో పవిత్రమైందని రాజ్యాంగంలోని నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పకుండా పాటించాలని, రాజ్యాంగాన్ని గౌరవించాలని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మేడ్చల్ కలెక్టరేట్‌లో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ కృషి కారణంగానే భారతదేశం అతి పెద్ద ప్రజాస్వామ్య దేశంగా నిలిచిందన్నారు. అనంతరం భారత రాజ్యాంగం పట్ల విధేయతతో నడుచుకుంటామని,రాజ్యాంగాన్ని గౌరవిస్తామని అధికారులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు.

డ్రగ్స్ అమ్ముతున్న ఇద్దరి అరెస్ట్

మూసాపేట: డ్రగ్స్ అమ్ముతున్న ఇద్దరిని కూకట్‌పల్లి పోలీసులు మంగళవారం రిమాండ్‌కు తరలించారు. పోలీసుల వివరాల ప్రకారం.. కూకట్‌పల్లిలోని మెట్రో పిల్లర్ 794 వద్ద రాజస్థాన్‌కు చెందిన డొల్ల రాము (23), కమలేష్ (26) డ్రగ్స్ అమ్ముతున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి అమ్మకందారులు, ముగ్గురు(మనవ్వర్ లాల్ (23), దేవీలాల్ (26), మాగిలాల్ (24) కొనుగోలుదారులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరు కూకట్‌పల్లిలోని స్టీల్ షాపులో పని చేస్తున్నారు. వారి నుంచి 15 గ్రాముల హెరాయిన్‌ను స్వాధీనం చేసుకున్నారు. అమ్మకందారులను రిమాండ్‌కు తరలించి, కొనుగోలుదారులకు నోటీసులు ఇచ్చి పంపించారు.

పెండింగ్ సమస్యల పరిష్కారానికి కృషి



ఆర్‌ఓ ప్రభాకర్‌ను సత్కరిస్తున్న కౌన్సిల్ సభ్యులు..

దుండిగల్: మున్సిపాలిటీ అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నామని, పెండింగ్ పనులను సైతం త్వరలోనే పూర్తి చేస్తామని దుండిగల్ మున్సిపల్ చైర్ పర్సన్ కృష్ణవేణి అన్నారు. మంగళవారం గండిమైసమ్మలోని మున్సిపల్ కార్యాలయంలో సాధారణ సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మున్సిపాలిటీలోని అన్ని ప్రాంతాలను కౌన్సిలర్ల సహకారంతో ఎంతో అభివృద్ధి చేశామని, మరింత అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. సమస్యల పరిష్కారానికి కౌన్సిల్ సభ్యులతో పాటు, ప్రజల భాగస్వామ్యం అవసరమన్నారు. ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం నూతనంగా బాధ్యతలు చేపట్టిన రెవెన్యూ అధికారి ప్రభాకర్‌ను కౌన్సిల్ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ పద్మారావు, తహశీల్దార్ మతిన్, మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ, కౌన్సిలర్లు శంభీపూర్ క్రిష్ణ, కుంటి అరుణ, అమరం గోపాల్ రెడ్డి, జక్కుల క్రిష్ణ యాదవ్, జక్కుల విజయ, ఆనంద్ కుమార్, సాయి యాదవ్, మహేందర్ యాదవ్, శివనూరి నవనీత, ఎల్లుగారి సత్యనారాయణ, భారత్ కుమార్, పీసరి బాలమణి, మౌనిక, మాదాస్ వెంకటేష్, కొర్ర శంకర్ నాయక్, జోస్పిన్, ఏఈ సురేందర్ నాయక్, మేనేజర్ సునంద, మున్సిపల్, ఇరిగేషన్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోళ్లు

సాక్షి,సిటీబ్యూరో: ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని మేడ్చల్–మల్కాజిగిరి కలెక్టర్ గౌతమ్ తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యం వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసి, రైతులకు వెంటనే డబ్బులు జమ అయ్యేలా ఏర్పాటు చేస్తున్నామన్నారు. మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మేడ్చల్ కలెక్టరేట్ నుంచి కలెక్టర్ గౌతమ్, అదనపు కలెక్టర్లు రాధికా గుప్తా, విజయేందర్‌రెడ్డి కలిసి పాల్గొన్నారు. జిల్లాలో 13 సెంటర్ల నుంచి 1012 మంది రైతుల నుంచి, 357 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలన్నారు. కేంద్రాలలో గన్ని సంచులు, ప్యాడీ క్లీనర్స్ అందుబాటులో ఉంచుకోవాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి రైతులకు వెంటనే డబ్బులు జమ అయ్యే విధంగా సంబంధిత జిల్లా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలన్నారు. సన్న రకం ధాన్యానికి బోనస్ డబ్బులు వెంటనే మంజూరు చేయాలన్నారు. రైతు సదస్సులోపు రైతులందరికీ వారి వారి ఖాతాలలో ధాన్యం కొనుగోలు డబ్బులు పడేలా ఆర్థిక శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు, పథకాలు, ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణపై రైతులకు అందిస్తున్న సౌకర్యాల గురించి ప్రజలకు చేరే విధంగా విస్తృత ప్రచారం చేయాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో వివిధ ప్రాంతాల నుంచి మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండాసురేఖ, జూపల్లి కృష్ణారావు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంత కుమారి, పౌరసరఫరాల కమిషనర్ చౌహాన్ పాల్గొన్నారు. మేడ్చల్ కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్‌తోపాటు డీఆర్‌ఓ హరిప్రియ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగంపై అవగాహన పెంచుకోవాలి



ప్రముఖులకు జ్ఞాపికలు అందజేస్తున్న సుందరరాజు, సరిత




అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న దృశ్యం

కుత్బుల్లాపూర్: రాజ్యాంగంపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని హైకోర్టు న్యాయమూర్తి టి.రజని అన్నారు. మంగళవారం కొంపల్లి సెయింట్ ఆంథోనీస్ విద్యా సంస్థల ఆధ్వర్యంలో రవీంద్రభారతిలో బాలల దినోత్సవం, రాజ్యాంగ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె రాజ్యాంగ దినోత్సవ ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. కుల, మత, ప్రాంతీయ భావాలు లేకుండా విశాల దృక్పథంతో విద్యార్థులు ఎదగాలన్నారు. ప్రముఖ విద్యావేత్త బాలలత మాట్లాడుతూ రాజ్యాంగ విలువలను చిన్నతనం నుంచే నేర్చుకోవాలని, నాయకత్వ లక్షణాలను పెంపొందించుకుని ప్రజాస్వామ్య పరిరక్షణకు కృషి చేయాలన్నారు. సెయింట్ ఆంథోనీస్ విద్యా సంస్థల అధినేత సుందరరాజు, డైరెక్టర్ సరిత ఆధ్వర్యంలో ప్రముఖులను సత్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.


జగద్గిరిగుట్ట: భారత రాజ్యాంగాన్ని పార్లమెంటులో ఆమోదించి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా జగద్గిరిగుట్ట భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు సామేల్ కార్యదర్శి రాములు ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. జగద్గిరిగుట్ట చివరి బస్టాండ్‌లో డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి రాష్ట్ర దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కే యేసురత్నం, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు చర్లపల్లి రాములు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ పౌరులందరూ రాజ్యాంగాన్ని చదవాలన్నారు. కార్యక్రమంలో హరినాథ రావు, భవన నిర్మాణ కార్మికులు ఆశప్ప, సాయిలు, కిష్టయ్య, అశోక్, ప్రవీణ్, మల్లయ్య, కిషన్, కాశప్ప, ఆరోగ్యం, తదితరులు పాల్గొన్నారు.

రంగారెడ్డినగర్: భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలను మంగళవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ డాక్టర్ బీ.ఆర్. అంబేడ్కర్ అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి రాజ్యాంగాన్ని రూపొందించారన్నారు. రాజ్యాంగమే దేశ ప్రజాస్వామానికి మూలమని,రాజ్యాంగ స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ గౌరవించాలన్నారు.


- బాచుపల్లి ఎస్సీ కాలనీలో అంబేడ్కర్ విగ్రహం వద్ద బ్లూ ఇండియా పార్టీ ప్రధాన కార్యదర్శి కమ్మెట భూపాల్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించి రాజ్యాంగ ప్రతులను పంపిణీ చేశారు.
- నిజాంపేట్‌లో జరిగిన వేడుకల్లో బీజేపీ నిజాంపేట, బాచుపల్లి అధ్యక్షుడు భిక్షపతి యాదవ్, ప్రసాద్ రాజు పాల్గొని అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు.
- రంగారెడ్డినగర్ డివిజన్ నందానగర్ చౌరస్తాలో అంబేడ్కర్ విగ్రహానికి స్వామి వివేకానంద యువజన సంఘం అధ్యక్షుడు జల్దా లక్ష్మినాథ్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు.



నిజాంపేట్‌లో..



బాచుపల్లి ఎస్సీ కాలనీలో..



నందానగర్ చౌరస్తాలో..

కార్మికులకు అన్యాయం చేస్తే సహించం



సీఐటీయూ జెండాను ఆవిష్కరిస్తున్న నేతలు

కుత్బుల్లాపూర్: యాజమాన్యాలకు తొత్తులుగా వ్యవహరిస్తూ కొన్ని యూనియన్లు కార్మికులకు ద్రోహం చేస్తున్నాయని సీఐటీయూ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు ఎర్ర అశోక్ అన్నారు. మంగళవారం షాపూర్‌నగర్–జగద్గిరిగుట్ట రోడ్డులోని హైదరాబాద్ ఇంటిగ్రేటెడ్ సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ కలెక్షన్ అండ్ ట్రాన్స్‌పోర్ట్ ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ యాజమాన్యాలు కార్మికులకు చట్ట ప్రకారం రావల్సిన వేతనాలు అమలు చేయకుండా మోసం చేస్తుందని ఆరోపించారు. కార్మికులకు అందాల్సిన అలవెన్స్‌లు, ఇతర సదుపాయాలు కల్పించకుండా వారితో వెట్టిచాకిరి చేయిస్తున్నారని, ఇందుకు కొన్ని యూనియన్లు సహకరిస్తున్నాయన్నారు. కార్మికులకు కట్టుబానిసలుగా చూస్తున్న యాజమాన్యాలపై సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని, 42 సైట్లలో సీఐటీయూ జెండాను ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. కార్మికులను విడగొట్టి జీతాలు పెంచకుండా అడ్డుకుంటున్నారని, ఇకపై వారి ఆగడాలు సాగనీయమన్నారు. మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పసుల అంజయ్య. రమేష్, కుమారస్వామి, వెంకటేష్, సారయ్య, యాకన్న, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.